# ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

**శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ**


శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీతో వైద్యశాఖ అధికారులు

**ఆల్విన్‌కాలనీ:** ప్రజలకు మెరుగైన వైద్యం అందించి ఆరోగ్య శేరిలింగంపల్లిగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి జోన్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుధాకర్ లాల్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయ పూర్ణిమ, శేరిలింగంపల్లి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ నూతనంగా నియమించబడిన సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే గాంధీని వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే అభినందించి, సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని, ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉండేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. కొండాపూర్ ఏరియా ఆసుపత్రి, పీహెచ్‌సీలు, బస్తీ దవాఖానలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, వైద్యం అందుతున్న తీరు తెన్నులను పరిశీలించాలన్నారు. సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.

# ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

**ఆల్విన్‌కాలనీ:** వినాయక చవితి సందర్భంగా నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని కేపీహెచ్‌బీ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంటీ హిల్స్ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం వినాయక మండపాల నిర్వాహకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండపాల ఏర్పాటు, ఉత్సవాల నిర్వహణకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. మట్టి వినాయక ప్రతిమలనే వినియోగించాలని, ఊరేగింపు సమయంలో అశ్లీల పాటలు, నృత్యాలు చేయకూడదన్నారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు ఎస్‌ఐలు మాధవరెడ్డి, సుమన్, మన్యం, రూప కాలనీ వాసులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ నీరు ఇళ్లలోకి రాకుండా చర్యలు తీసుకోవాలి


అధికారులతో కలిసి పర్యటిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం తదితరులు

**మోతీనగర్:** వర్షాలకు డ్రైనేజీ నీరు ఇళ్లలోకి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ సబిహాబేగం అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సఫ్దార్‌నగర్, రాజీవ్ గాంధీ నగర్‌లో మంగళవారం అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారీ వర్షాలు వచ్చినప్పుడు నాలాలో పెరిగిన నీటి మట్టానికి నాలా చుట్టుపక్కల ఉన్న ఇళ్లల్లోకి డ్రైనేజీ నీరు వెనుకకు రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనికి తగిన పరిష్కారాన్ని చూడాలని అధికారులను కోరారు. మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ గౌసుద్దీన్, జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ ఏఈ రంజిత్, జలమండలి సీవరేజ్ బోర్డు మేనేజర్ రవీందర్, అబ్దుల్ హమీద్, సయ్యద్ రియాజ్, మల్లేషం, సలీం, ముత్యాల దుర్గ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయంలో పూజలు


పూజలో పాల్గొన్న కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు దంపతులు తదితరులు

**కేపీహెచ్‌బీకాలనీ:** కేపీహెచ్‌బీ డివిజన్ 9వ ఫేజ్‌లోని విజయ గణపతి ఆలయంలో వార్షికోత్సవ పూజా కార్యక్రమాల్లో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు దంపతులు పాల్గొన్నారు. మంగళవారం ఉదయం జరిగిన పుణ్యాహవచనం, సాయంత్రం ధ్వజపటం కట్టడం, అంకురార్పణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే గాంధీని కలిసిన ఏఎంఓహెచ్



**ఆల్విన్‌కాలనీ:** శేరిలింగంపల్లి సర్కిల్ ఏఎంఓహెచ్‌గా నియమించబడిన శ్రీకాంత్ రెడ్డి మంగళవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ శ్రీకాంత్ రెడ్డిని అభినందించారు. రాంకీ, జీహెచ్‌ఎంసీ అధికారుల సమన్వయం లోపం తలెత్తకుండా చూడాలని సూచించారు. చెత్తకుప్పలు పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# యూజీసీ పే స్కేల్ అమలు చేయాలి


జేఎన్‌టీయూలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

**కేపీహెచ్‌బీకాలనీ:** విశ్వ విద్యాలయాల్లో బోధిస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులకు బేసిక్ పే, డీఏ, హెచ్ఆర్‌ఏలతో కూడిన యూజీసీ పే స్కేల్‌ను వెంటనే అమలు చేయాలని జేఎన్‌టీయూలోని కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు యూనివర్సిటీలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల గురించి సీఎం ఎటువంటి ప్రస్తావన చేయకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యను పరిష్కరించి ప్రభుత్వ విశ్వ విద్యాలయాలను బలోపేతం చేయాలని కోరారు.

# పుస్తక పఠనం..మెరుగైన ఫలితం!

- కరోనాలో ఆన్‌లైన్ తరగతులతో విద్యార్థుల్లో తగ్గిన పుస్తక పఠనం
- రెండేళ్లుగా ప్రభుత్వ బడుల్లో రీడింగ్ క్యాంపెయిన్‌తో మెరుగైన ఫలితం
- ఇళ్లలోనూ పుస్తక పఠనంపై విద్యాశాఖ ప్రత్యేక శ్రద్ధ
- తల్లిదండ్రుల ప్రత్యేక శ్రద్ధతో ఇంటి వద్ద దృష్టి సారించేలా చర్యలు
- పాఠశాల నుంచి మానిటరింగ్‌కు ప్రత్యేక టీచర్‌ను నియమించేలా కసరత్తు


ప్రభుత్వ బడుల్లో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

**సాక్షి, సిటీబ్యూరో:** కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో నిర్వహించిన ఆన్‌లైన్ తరగతులతో విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆసక్తి తగ్గి సెల్‌ఫోన్లు, కంప్యూటర్ల వీక్షణం పెరిగింది. ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ రంగప్రవేశంతో విద్యార్థుల్లో పుస్తక పఠనాశక్తి పడిపోతోంది. అతి వినియోగంతో కంటి రుగ్మతలతో పాటు ఇతర సమస్యలు కొనితెచ్చుకుంటున్నారు. సెలవు రోజుల్లోనూ డిజిటల్ తెరలకే అతుక్కుపోతున్నారు. దీంతో వారి అభ్యాసన సామర్థ్యాలు గణనీయంగా పడిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల నుంచి పిల్లలను బయటకు తీసుకురావడానికి విద్యాశాఖ పాఠ్యపుస్తక పఠనం, రాయడంపై శ్రద్ధ చూపాలని భావిస్తోంది. గ్రేటర్ హైదరాబాద్‌సహా శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలో 2,447 పాఠశాలలు ఉండగా, ఇందులో హైదరాబాద్ జిల్లాలో 631 పాఠశాలలు, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 515 పాఠశాలలు, రంగారెడ్డి జిల్లాలో 1,301 పాఠశాలలు ఉన్నాయి. రెండేళ్ల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల్లో పఠనా శక్తిని పెంచటంతోపాటు నైపుణ్యాన్ని పెంపొందించటానికి ‘చదువు–ఆనందించు–అభివృద్ధి చెందు’ అనే నినాదంతో రీడింగ్ క్యాంపెయిన్ కార్యక్రమాన్ని ప్రభుత్వ నిర్వహిస్తోంది.

- విద్యాశాఖ చేపట్టిన ఈ కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తుండటంతో ఇక ఇళ్లల్లో కూడా విద్యార్థులకు పుస్తక పఠనానికి అనుకూల వాతావరణం కల్పించేలా తల్లిదండ్రులు వ్యవహరించాలని సమావేశాలు నిర్వహిస్తోంది.
- తొలి పీటీఎం (తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం)లో ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఇంటివద్ద పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ‘రీడింగ్ కార్నర్లు’ ఏర్పాటు చేయాలని పేర్కొంటోంది.

### ప్రశాంత వాతావరణం...

ప్రైవేటు బడుల్లో చదివే పిల్లలకు వారి తల్లిదండ్రులు ఇంటి వద్ద హోంవర్క్ చేసుకునేలా అందుకు కావాల్సిన రీడింగ్ కార్నర్ వంటి అనుకూల వాతావరణం కల్పిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల విషయంలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. దీన్ని మార్చేందుకు పిల్లలు ఇంటికి రాగానే వారిపై ప్రత్యేక దృష్టి సారించి చదివేందుకు ఇంట్లోనే ప్రత్యేక ప్రదేశాన్ని ఏర్పాటు చేయాలి. ఆ సమయంలో టీవీలు, రేడియో, సెల్‌ఫోన్లు వినియోగించవద్దని సూచించారు.

### తల్లిదండ్రులు ఇలా చేయాలి...

విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచేందుకు ఇదివరకే ప్రభుత్వ బడుల్లో ‘రీడింగ్ క్యాంపెయిన్లు, కార్నర్స్ ఏర్పాటు చేశారు. ఇంట్లో కూడా దీన్ని ఏర్పాటు చేయాలని పీటీఎం సమావేశాల్లో వివరిస్తున్నామని విద్యాశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. తల్లిదండ్రులు పిల్లల్ని ఇంటి వద్ద రోజూ కొంత సమయం చదివిస్తే అభ్యాసన సామర్థ్యాలు మెరుగుపడి మంచి ఫలితాలు సాధించే అవకాశాలు మెండుగా ఉంటాయని భావిస్తున్నారు.

### అవగాహన కల్పిస్తున్నాం



ఇంటికి రాగానే తమ పిల్లల చదువుపై తల్లిదండ్రులు ఆరా తీయాలి. ఆ రోజు ఏం నేర్చుకున్నారు? హోంవర్క్ ఇచ్చారా? అని పరిశీలించాలి. అభ్యాసన తీరు గమనించాలి. పిల్లలు సౌకర్యవంతంగా చదువుకోవడానికి కుర్చీలు, బల్లలు వంటి సదుపాయాలు కల్పించాలి. రీడింగ్ కార్నర్ వద్ద సరైన గాలి, వెలుతురు ఉండేలా చూడాలి. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాల్ని కంఠస్థం చేసేలా రోజూ ప్రోత్సహించాలి. పిల్లలు పెద్దలను అనుకరిస్తారు. పెద్దలు నిత్యం టీవీ, సెల్‌ఫోన్లు వాడుతూ కనిపిస్తే పిల్లల ఏకాగ్రత దెబ్బతింటుందని గ్రహించాలి. వ్యక్తిత్వ వికాసం, బొమ్మల కథలు, పరిసరాల విజ్ఞానం, శాస్త్రసాంకేతిక రంగాలపై బాలలస్థాయి పుస్తకాలను విద్యార్థులకు అందుబాటులో ఉంచాలి.

– ఐ.విజయకుమారి,
డీఈఓ, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా

## బ్రోచర్ ఆవిష్కరణ

**కూకట్‌పల్లి:** కేపీహెచ్‌బీ కాలనీలో స్థానికుడు రుద్రపాటి వీరాంజనేయులు ఇటీవల ఇంటీరియర్, కన్‌స్ట్రక్షన్ కంపెనీ స్థాపించారు. మంగళవారం దీనికి సంబంధించిన బ్రోచర్‌ను బాలానగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బండి రమేష్ ఆవిష్కరించారు. ఈ కంపెనీ ద్వారా పలువురు నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నాడు. కార్యక్రమంలో లక్ష్మయ్య, పుష్పారెడ్డి, మేనేజర్ సంపత్, వెంకట్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## చెరువు కబ్జా వివరాల అందజేత


హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వివరాలు అందజేస్తున్న కార్పొరేటర్ మహేందర్

**మూసాపేట:** హైడ్రా కమిషనర్ ఏ. వి. రంగనాథ్‌కు మూసాపేట డివిజన్ కార్పొరేటర్ మహేందర్ నియోజకవర్గంలోని చెరువులు, వాటి కబ్జా వివరాలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎప్పుడో నిర్మించిన భవనాల కూల్చివేత క్రమంలో కొంత ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని, పేద ప్రజలకు అన్యాయం జరుగకుండా చూడాలని కోరారు. ఎఫ్‌టీఎల్ పరిధిని మార్చి అక్రమంగా పర్మిషన్లు తీసుకొని నిర్మిస్తున్న నిర్మాణాలను ఆపాలని ఆయన కోరారు.

# గణేష్‌నగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారం


పూడిక తీపిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

**ఆల్విన్‌కాలనీ:** డివిజన్ పరిధి ఎల్లమ్మ బండలోని గణేష్ నగర్‌లో డ్రైనేజీ లైన్ నిండి రోడ్డుపై ప్రవహించటంతో దుర్గంధం, దుర్వాసన వెదజల్లింది. ఈ విషయాన్ని స్థానికులు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన మంగళవారం జీహెచ్‌ఎంసీ సిబ్బందితో ఎయిర్‌టెక్ యంత్రం సహాయంతో డ్రైనేజీ పూడికతీత తీయించటంతో సమస్య పరిష్కారమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లోని ప్రతి కాలనీకి రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. రానున్న వినాయక ఉత్సవాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సంతోష్, శివరామకృష్ణ, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## 29న ‘నయా ఉత్సవ్ - నయా చేతన’

**నిజాంపేట్:** బాచుపల్లిలోని జాయ్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో ఈనెల 29న ‘నయా ఉత్సవ్ – నయా చేతన’కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల నయా ఉత్సవ్ కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి దోహద పడనుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఫ్లూట్ మేకింగ్, క్రౌన్ మేకింగ్, భక్తి గీతాలు, కథలు, కలర్ ద కృష్ణ, రాఖీ మేకింగ్, పాట్ పెయింటింగ్ వంటివి ఉంటాయన్నారు. ఇందులో పాల్గొనే విద్యార్థులు తమ వెంట వస్తు సామగ్రిని తెచ్చుకోవాలని కోరారు. కాల్ రిజిస్టర్ చేసుకోవడానికి ఫోన్ నం.99853 40022 /040–40281916లో సంప్రదించాలన్నారు.

## ఏఐ డిజిటల్ అభ్యాసాన్ని మెరుగుపరుస్తుంది

**రాయదుర్గం:** ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ డిజిటల్ అభ్యాసాన్ని మెరుగుపరుస్తుందని హాంకాంగ్‌లోని ది ఎడ్యుకేషన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ జుసియోంగ్‌లీ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని మనూలో ‘ఇన్ఫర్మేషన్ డిజిటల్ లెర్నింగ్ ఆఫ్ ఇంగ్లిష్ (ఐడీఎల్‌ఈ), జనరేటివ్ ఏఐ ఇన్ లాంగ్వేజ్ టీచింగ్ అండ్ రీసెర్చ్’ అనే అంశంపై నిర్వహించే అంతర్జాతీయ సమావేశంలో భాగంగా ‘మనూ’ ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌సీయూ, ఓక్సన్ విశ్వవిద్యాలయం సంయుక్తంగా ఈనెల 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు అంతర్జాతీయ సదస్సును 3 రోజులపాటు నిర్వహించనున్నారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో ఆంగ్లభాషా బోధన, పరిశోధనలో ఏఐ సాధనాలకు పెరుగుతున్న ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమాన్ని సీనియర్ ప్రొఫెసర్ పంచానన్ మొహంతి ప్రారంభించగా, రిసోర్స్‌పర్సన్లు డాక్టర్, ప్రమోద్ సాహ, డాక్టర్ జుసియొంగ్‌లీ వ్యవహరించారు. ఈ సమావేశంలో మనూ ఓఎస్‌డీ–1 ప్రొఫెసర్ షుగుఫ్తాషాహీన్, మనూ ఆజాద్ చైర్ ప్రొఫెసర్ ఇంతియాజ్, రీసెర్చ్ స్కాలర్లు టీనా థామస్, ఎన్‌కే నజ్మా ప్రసంగించారు.

## నేటి నుంచి అంతర్జాతీయ సదస్సు

**రాయదుర్గం:** మనూలో అంతర్జాతీయ సదస్సు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ‘మనూ’ ఇంగ్లిష్ విభాగం ఆధ్వర్యంలో ‘వాయిసెస్ ఆఫ్ ఇండియా అండ్ బియాండ్ : మొబిలిటీ, సస్టెనబిలిటీ అండ్ టెక్నాలజీ’ అనే అంశంపై 3 రోజుల పాటు సదస్సు నిర్వహిస్తారు. ఈ సదస్సును ‘మనూ’తో పాటు, హెచ్‌సీయూ, ఓక్సన్ యూనివర్సిటీలలో కూడా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## విద్యార్థుల మధ్య ఘర్షణ.. కేసు నమోదు

**కేపీహెచ్‌బీకాలనీ:** జేఎన్‌టీయూహెచ్‌లో బోర్డర్, నాన్ బోర్డర్ విద్యార్థుల నడుమ నెలకొన్న ఘర్షణ దాడులకు దారితీసింది. పోలీసులు మంగళవారం ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు. కొంత కాలంగా జేఎన్‌టీయూహెచ్ విద్యార్థి నాయకుల మధ్య నెలకొన్న ఆధిపత్య పోరు కూడా ఘర్షణకు ఆజ్యం పోయడంతో భౌతిక దాడుల వరకు వెళ్లింది. పోలీసుల వివరాల ప్రకారం.. జేఎన్‌టీయూహెచ్ బాలుర వసతి గృహాల్లో బయటి వ్యక్తులు తిష్ట వేయకుండా కట్టడి చేయాలని పలువురు విద్యార్థులు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం ఇచ్చారు. దీంతో వినతిపత్రం ఇచ్చిన విద్యార్థులతో నాన్‌బోర్డర్స్ క్యాంటీన్ వద్ద గొడవకు దిగారు. మరోమారు ఫిర్యాదు చేస్తే సంగతి చూస్తామంటూ బెదిరించారు. దీంతో సోమవారం ఉదయం కేపీహెచ్‌బీ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా.. వారు నాన్ బోర్డర్స్‌ను స్టేషన్‌కు పిలిచి మందలించి పంపించారు. తిరిగి రాత్రి వేళలో మరోమారు గొడవకు దిగి కర్రలతో కొట్టుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎమ్మెల్సీ కవితకు బెయిల్ హర్షణీయం

**ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**



**కూకట్‌పల్లి:** ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సుప్రీంకోర్టులో బెయిల్ లభించటం హర్షణీయమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఎప్పటికైనా న్యాయం గెలుస్తుందన్న నమ్మకాన్ని సుప్రీం కోర్టు మరో మారు రుజువు చేసిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబాన్ని రాజకీయంగా ఎదుర్కోలేక కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు కుట్రపూరితంగా వ్యవహరించాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాలను రాజకీయంగానే ఎదుర్కోవాలని అన్నారు. కోర్టు బెయిల్ మంజూరు చేసినా కొన్ని పార్టీల ప్రతినిధులు జీర్ణించుకోలేక నోటికి ఇష్టం వచ్చినట్లు ఆరోపణలకు దిగటం సిగ్గుచేటన్నారు.

## అక్రమంగా షెడ్ల నిర్మాణం

- పట్టించుకోని అధికారులు
- చర్యలు తీసుకోవాలని యువత ఫిర్యాదు


అనుమతులు లేకుండా నిర్మించిన షెడ్డు

**బాలానగర్:** ఫతేనగర్ డివిజన్ పరిధిలో అనుమతులు లేకుండానే షెడ్ల నిర్మాణం జరుగుతుంది. టౌన్ ప్లానింగ్ అధికారుల అండదండలతోనే తెనుగు బస్తీ, పోచమ్మ గుడి దగ్గర, గౌతమ్ నగర్, ఓల్డ్ ఎయిర్‌పోర్టు రోడ్లలో షెడ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాణిజ్య అవసరాల కోసం ఎటువంటి ప్రాథమిక అనుమతి తీసుకోకుండానే కొందరు నిర్మాణాలు పూర్తి చేశారు. షెడ్ల నిర్మాణాన్ని అడ్డుకోవాలని డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో యువకులు ఇటీవలే ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు కేవలం నోటీసులు అందజేసి చేతులు దులుపుకున్నారు. నివాస ప్రాంతాల్లో షెడ్లను వేసి వాణిజ్య అవసరాలకు వినియోగిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగించే నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. షెడ్ల నిర్మాణాలపై టీపీఎస్ మహేందర్‌ను వివరణ కోరగా.. తాను కొత్తగా వచ్చాను అని, పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ఆర్టీసీ కార్మికుల నిరసన


నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న కార్మికులు

**మూసాపేట:** కూకట్‌పల్లి డిపో ఎదుట ఆర్టీసీ కార్మికులు మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. జేఏసీ రాష్ట్ర నాయకుడు కమలాకర్ గౌడ్ మాట్లాడుతూ..పని భారం ఎక్కువవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థికపరమైన సమస్యలు, ప్రభుత్వంలో విలీనం, వేతన సవరణ, ప్రభుత్వ ఉద్యోగులతో సమాన వేతన సవరణ వంటి సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## 31న శ్రావణ మంగళ గౌరీ మహాలక్ష్మి కుంకుమార్చన

**సనత్‌నగర్:** శ్రావణమాస విశేష పూజా కార్యక్రమాల్లో భాగంగా సనత్‌నగర్ హనుమాన్ దేవాలయంలో ఈ నెల 31 చివరి శనివారం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఈఓ శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీవిష్ణు సహస్రనామ, సత్సంగ్ సభ్యుల సహకారంతో ఉదయం 10 గంటలకు 1,008 మంది మహిళలతో హరిహరులకు విశేషంగా లలిత, విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణం, లింగాష్టకం, హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతుందని పేర్కొన్నారు. తదుపరి మహిళలందరిచే సామూహికంగా శ్రావణ మంగళగౌరీ మహాలక్ష్మి అమ్మవారి కుంకుమార్చన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ ప్రవచనకర్త డాక్టర్ అనంత లక్ష్మి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

## స్పోర్ట్స్ మీట్



**చింతల్:** డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంటీ గ్రౌండ్‌లో ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్ ఆధ్వర్యంలో 18వ రాజీవ్ గాంధీ మెమోరియల్ ఎన్‌ఎస్‌యూఐ స్పోర్ట్స్ మీట్ రెండో రోజు కొనసాగింది. అందులో భాగంగా మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని పలు కళాశాలల జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కందడి శివారెడ్డి, సుదర్శన్‌రెడ్డి హాజరై పోటీలను ప్రారంభించారు. మేడ్చల్ జిల్లా ఎన్‌ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శి సాయి కిరణ్, విశ్వ, నవీన్, అనూప్, కిరణ్, చిన్న, సాయి తదితరులు పాల్గొన్నారు.

# ప్యాచ్ వర్క్ పనులైన చేపట్టరా?

- డ్రైనేజీ పనుల కోసం తవ్వి.. వదిలేసిన వైనం
- వరదలకు మట్టి కొట్టుకుపోయి తేలిన కంకర
- నెలలు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు



**ఆల్విన్‌కాలనీ:** కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డినగర్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనుల కోసం రోడ్డును తవ్వారు. పనులు పూర్తై కొన్ని నెలలు గడుస్తున్నా కనీసం రోడ్డుకు ప్యాచ్ వర్క్ పనులు కూడా చేయకపోవడంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలకు గుంతలు ఏర్పడి కంకర రాళ్లు గుచ్చుకొని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు వాపోతున్నారు. పాపిరెడ్డినగర్ పల్లంగా ఉండటంతో పైనున్న కాలనీల వరదనీరు కూడా ఇదే రహదారులపై ప్రవహిస్తుండటంతో వరదలకు మట్టి కొట్టుకుపోయి కంకరరాళ్లు తేలడంతో పాదాచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అనేక మార్లు ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాపిరెడ్డినగర్‌లోని బీసీ బ్లాక్‌లలోని రహదారుల రోడ్డు, ప్యాచ్ వర్క్ పనులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా రహదారి నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

